## భూమి పంచాయితీలకు కాంగ్రెస్ కుట్ర



కృష్ణకాలనీ : ధరణి ఉండబట్టే రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సేవలం దుతున్నయ్. ధరణిని రద్దు చేస్తే రాష్ట్రంలో మళ్లీ భూముల పంచాయితీలు పెరుగుతయ్. కాంగ్రెస్ నాయకులు అధికారంలోకి వస్తే ధరణిని తీసి బంగాళాఖాతంలో పడేస్తం అంటున్నరు. వాళ్లకేమన్నా సిగ్గుందా? అసలు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందా? రేవంత్‌రెడ్డి తీరుతో కాంగ్రెస్‌ను ప్రజలు విస్మరిస్తున్నరు. రేవంత్‌రెడ్డి వ్యవసాయం తెల్వని ఓ దద్దమ్మ. కాంగ్రెస్‌కు ఓటేస్తే మళ్లా తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరగడం ఖాయం. రాష్ట్రంలోని ప్రభుత్వ భూములను అక్రమంగా కబ్జా చేయడానికి కాంగ్రెసోళ్లు ధరణిని తీసేస్తమంటున్నరు. కేసీఆర్ వెంటే రైతులమంతా ఉంటం.

**- సెగ్గం విక్రమ్, రైతు, గడ్డిగానిపల్లి, భూపాలపల్లి .**

## 3 గంటల కరెంట్‌తో మూడు గుంటలు పారదు..



రేగొండ : 3 గంటల కరెంట్ ఇస్తే 3 గుంటలకు కూడా సాగునీరు అందదు. రేవంత్ రెడ్డికి ఎవుసం అంటే ఏందో తెల్వదు. ఆయనకు రైతు బాధలు తెలుసా? 3 గంటల కరెంట్ చాలు, 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలంటు పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నడు. అలాంటి ప్రభుత్వం వస్తే రైతులకు ఏం చేస్తుంది? కేసీఆర్ సార్ అధికారంలోకి వచ్చిన తర్వాతనే ఎవుసం బాగుపడింది. సార్ పాలనలో పుష్కలంగా సాగునీరు, 24 గంటల కరెంట్ ఇవ్వడంతో 3 పంటలు సాగుచేస్తున్నం. రైతులం కూడా ఎంతో అభివృద్ధి చెందినం. పొరపాటున కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతుల పరిస్థితి ఆగమైతది. రైతు సంక్షేమం కోసం పాటుపడే నాయకుడిని ఎన్నుకుంటం.

**- మడగాని రాంచందర్, రైతు, రేగొండ.**



# పోలింగ్‌కు సర్వం సిద్ధం

- నియోజకవర్గం పరిధిలో 317 పోలింగ్ కేంద్రాలు
- ఓటర్లు, దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు
- ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి
- సమస్యాత్మక కేంద్రాల వద్ద ప్రత్యేక భద్రత
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భవేష్ మిశ్రా

కృష్ణకాలనీ, నవంబర్ 29 : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భవేష్ మిశ్రా తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సందర్శించి, అధికారులకు పలు సూచనలు చేశారు. పోలింగ్ సామగ్రి పంపిణీ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించిన ఈవీఎంలను సదరు సిబ్బందికి అప్పజెప్పాలని, రిజర్వ్ ఈవీఎంలను సెక్టార్ అధికారుల వద్ద భద్రంగా ఉంచాలన్నారు. పోలింగ్ సిబ్బంది ఎన్నికల నియమ నిబంధనలను తప్పక పాటించాలన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భూపాలపల్లి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొత్తం 317 పోలింగ్ కేంద్రాలను 29 సెక్టార్లుగా విభజించామన్నారు. 25 శాతం బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, 40 శాతం అదనంగా వీవీ ప్యాట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా కేటాయించిన ఈవీఎంలు పంపిణీ చేశామనీ, ప్రతి సెక్టార్ అధికారి వద్ద 2 బ్యాలెట్ యూనిట్లు, 2 కంట్రోల్ యూనిట్లు, 4 వీవీ ప్యాట్లు రిజర్వ్‌గా ఉంచామన్నారు. ఎన్నికల సిబ్బంది ఇబ్బందులు పడకుండా సకల వసతులు కల్పించామన్నారు. జిల్లాలో ఉన్న ఓటర్లందరూ తప్పని సరిగా గురువారం జరిగే పోలింగ్‌లో పాల్గొని ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లకు అవసరమైన తాగునీరు, టాయిలెట్స్, ఇతర వసతులు కల్పించామన్నారు. దివ్యాంగుల కోసం ర్యాంపులు, ట్రైసైకిళ్లు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాటు చేశామని, సమస్మాత్మక కేంద్రాల వద్ద అదనపు బలగాలను మోహరించామని తెలిపారు. జిల్లాలో అధిక పోలింగ్ శాతం నమోదయ్యేలా విస్తృతంగా అవగాహన కల్పించామన్నారు. ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా ప్రజలు ఆలోచించి, స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.



పంపిణీ కేంద్రంలో అధికారులకు సూచనలిస్తున్న ఎన్నికల అధికారి, కలెక్టర్ భవేశ్ మిశ్రా

### చిట్యాలలో..

చిట్యాల : మండలంలో గురువారం ప్రశాంత వాతావరణంలో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ (ఏఆర్‌వో), తహసీల్దార్ సుమన్ తెలిపారు. మండలంలో 30,329 మంది ఓటర్లు ఉండగా 38 బూత్‌లను ఏర్పాటు చేశామన్నారు. అలాగే అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్, బయట వీడియో కెమెరాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మండల కేంద్రం, రామచంద్రాపూర్‌లోని పోలింగ్ కేంద్రాలను అసిస్టెంట్ కలెక్టర్ ఉమాశంకర్, జడ్పీ సీఈవో విజయలక్ష్మి సందర్శించారు. మండల కేంద్రంలోని 166 పోలింగ్ కేంద్రాన్ని మహిళా నిర్వాహక, రామచంద్రాపూర్‌లోని 108వ పోలింగ్ కేంద్రాన్ని వ్యవసాయ ఆధారిత కేంద్రగా ఎంపిక చేయగా వాటిని అందంగా ముస్తాబు చేశారు. ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు, అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు అసిస్టెంట్ కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామయ్య, ఆర్ఐ రాజు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### రేగొండలో..

రేగొండ : మండలంలో గురువారం జరిగే పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహశీల్దార్ సత్యనారాయణస్వామి తెలిపారు. మండలంలోని 37 జీపీల్లో 58 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. కేంద్రాల వద్ద వైద్య, విద్యుత్, తాగు నీటి సౌకర్యాలు కల్పించామని, ఎలాంటి ఘర్షణలు జరుగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మండలంలో 48,326 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు తెలిపారు.

### మొగుళ్లపల్లిలో..

మొగుళ్లపల్లి : మండలంలో గురువారం నిర్వహించనున్న శాసన సభ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ సునీత తెలిపారు. మండల వ్యాప్తంగా 37 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా 148 మంది సిబ్బంది విధులు నిర్వర్తించనున్నట్లు చెప్పారు. సిబ్బంది బుధవారం సాయంత్రం మండలానికి చేరుకోగా వారికి కావాల్సిన వసతులు కల్పించామన్నారు.

### టేకుమట్లలో..

టేకుమట్ల : మండలంలో గురువారం జరిగే అసెంబ్లీ ఎన్నికలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మండలంలో 28 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, పోలీసు బందోబస్తు మధ్య ఎన్నికల అధికారులు, సిబ్బంది తమకు కేటాయించిన సామగ్రితో ఆయా కేంద్రాలకు బుధవారం సాయంత్రం చేరుకున్నారు. ఎలాంటి ఘటనలు జరుగకుండా ఎస్సై గట్ల సుధాకర్ ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు బందోబస్తు నిర్వహిస్తున్నాయి.

### పోలింగ్ కేంద్రాల పరిశీలన

గణపురం : మండలంలోని పోలింగ్ కేంద్రాలను బుధవారం అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు సందర్శించారు. మండల కేంద్రంలోని 8 పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో సిబ్బందికి, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నా రు. ఆయన వెంట ఎంపీడీవో అరుంధతి, డిప్యూటీ తహసీల్దార్ మురళీధర్ రావు, దేవేందర్, విజేందర్ తదితరులున్నారు.

### శాయంపేటలో..

శాయంపేట : మండలంలో గురువారం జరిగే అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా 42 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. బుధవారం సాయంత్రం కేంద్రాలకు ఈవీఎంలు, సామగ్రితో పోలింగ్ సిబ్బంది చేరుకున్నారు. కేంద్రాల వద్ద అభ్యర్థుల గుర్తులతో కూడిన పేపర్లను అంటించారు. పెద్దకోడెపాక, పత్తిపాక, నేరేడుపల్లి, కొప్పుల, గట్లకానిపర్తి గ్రామాలను సమస్యాత్మకంగా గుర్తించారు. ఇక్కడ నలుగురు బీఎస్‌ఎఫ్ ఆర్మీ బలగాలతో బందోబస్తు ఏర్పాటుచేశారు. సమస్యాత్మక గ్రామాలతో పాటు పలు చోట్ల వెబ్ కెమెరాలను అమర్చారు. మండలంలో 33,459 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమై సాయంత్రం 4 గంటలకు ముగుస్తుందని అధికారులు తెలిపారు.



చిట్యాల : పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్



గణపురం : పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో, అధికారులు



టేకుమట్ల : పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఎన్నికల సిబ్బంది





చిట్యాల : మండల కేంద్రంలో అందంగా తీర్చిదిద్దిన మహిళా నిర్వాహక పోలింగ్ కేంద్రం



శాయంపేట : పోలింగ్ ఏర్పాట్లు చేస్తున్న పీవో, ఏపీవోలు